



ఉత్సవమూర్తులు

రావణ వాహనంపై.. చంద్రఘంట

శ్రీశైలంలో వైభవంగా దసరా ఉత్సవాలు

శ్రీశైలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు బుధవారం భ్రమరాంబికా అమ్మవారు చంద్రఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై చంద్రఘంట అలంకారంలో ఉన్న అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈఅలంకరణలో అమ్మవారు దశ భుజాలను కలిగి ఉండి ప్రశాంతమైన వదనంతో సాత్విక స్వరూపిణిగా దర్శనమిచ్చారు. అమ్మవారి మస్తకంపై అర్ధచంద్రుడు అలరాడుతున్న కారణంగా ఈ దేవిని చంద్రఘంటాదేవిగా పిలుస్తారు. ఈ దేవిని పూజించడం వల్ల కష్టాలన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ దేవిని ఆరాధించడం వల్ల సౌమ్యం, వినమ్రత కలుగుతాయని వేదపండితులు తెలిపా రు. అమ్మవారికి బిల్వ దళాలతో శాస్త్రోక్తంగా అర్చకులు, వేద పండితులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సు గంధ ద్రవ్యాలతో ధూప దీప నైవేద్యాలతో పూజించారు. మహామంగళ హారతులిచ్చారు. అమ్మవారి క్షేత్రంలో కుమారి పూజలు నిర్వహించారు. భ్రమరాంబికా అమ్మవారిని చంద్రఘంట అలంకారంలో, అలాగే మల్లికార్జునస్వామి అమ్మవార్లను రావణ వాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం వైభవంగా గ్రామోత్సవానికి ఆదిదంపతులు బయలుదేరగా ఉత్సవమూర్తుల ఎదు ట కోలాటాలు, చెక్కభజనలు, వివిధ రకాల గిరిజన నృత్యాలు, వివిధ రకాల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఆలయం లోపలి నుంచి భాజా భజంత్రీల నడుమ అమ్మవారులు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో శ్రీనివాసరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


అలంకరణలో శివపార్వతులు

సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం తెనాలికి చెందిన ఎస్.వరలక్ష్మి కల్యాణి బృందం నిర్వహించిన భక్తిరంజని, రాత్రి విజయనగరం జిల్లాకు చెందిన ఎం.ఎస్. సుప్రియ బృందం, నంద్యాల కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు కూష్మాండ దుర్గ అలంకరణ

దసరా ఉత్సవాల్లో నాలుగో రోజు గురువారం అమ్మవారు కూష్మాండ దుర్గగా భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం శివయ్యతో కలిసి అమ్మవారు కైలాస వాహనంపై క్షేత్ర వీధుల్లో విహరిస్తారు.


స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం


గ్రామోత్సవంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులు




కోలాటం చేస్తున్న కళాకారులు

స్వచ్ఛమైన ఓటర్ల జాబితాకు సహకరించండి

డీఆర్వో రామునాయక్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఆర్వో రామునాయక్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపుపొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన, తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందిస్తామని అందుకు రాజకీయ పార్టీలు సహాయ, సహకారాలు అందజేయాలన్నారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఏవో సుబాకర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు డీడీగా విఘ్నేష్ అప్పావ్



ఆత్మకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా విఘ్నేష్ అప్పావ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అబ్దుల్ రవూఫ్ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న విఘ్నేష్ అప్పావ్‌ను ఆత్మకూరుకు బదిలీ చేశారు. తమిళనాడులోని కొయంబత్తూరు ప్రాంతానికి చెందిన విఘ్నేష్ అప్పావ్ 2020లో ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికయ్యారు. తొలి పోస్టింగ్ సున్నిపెంటకు సబ్ డీఎఫ్‌వోగా వచ్చిన ఆయన ఆ తర్వాత 2022లో మార్కాపురం డీఎఫ్‌వోగా పని చేసి అనంతపురం జిల్లాకు వెళ్లారు. మార్కాపురం డీఎఫ్‌వోగా పనిచేసిన సమయంలో ఒక నెలరోజుల పాటు ఆత్మకూరు ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా కూడా పనిచేశారు.

భూ కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏపీఎస్‌పీసీఎల్) లీజు ప్రాతిపదికన భూముల కేటాయింపునకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే పంపాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామనాయక్, కలెక్టర్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గడివేముల మండలం గని గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని పరిశీలించామన్నారు. దాదాపు 604.99 ఎకరాల భూమిని లీజు పద్ధతిలో కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సీసీఎల్‌ఏ కార్యాలయానికి పంపాలని అధికారులకు సూచించారు.

882 అడుగులుగా శ్రీశైలం డ్యాం నీటిమట్టం


పదిగేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 882 అడుగులు గానూ, నీటినిల్వ సామర్థ్యం 199 టీఎంసీలుగానూ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా ఉందన్నారు. రిజర్వాయర్‌కు ఎగువ జూరాల స్పిల్‌వే నుంచి 2,21,120 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 27,927 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,784 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరాయి. ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 14 అడుగుల ఎత్తుమేరకు తెరిచి 3,45,730 క్యూసెక్కులు విడుదల చేశారు.

అన్ని సౌకర్యాలు కల్పించాం

● విజయవాడకు బయలుదేరిన డీఎస్సీ అభ్యర్థులు ● కలెక్టర్ సిరి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో నిర్వహించే సభకు వెళ్లేందుకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ సిరి పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,805 మంది అభ్యర్థులను వారి సహాయకులతో బయలుదేరే 123 బస్సులను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో గురువారం సీఎం నియామక పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఒక పోలీస్ ఎస్కార్ట్, బస్సులో మెడికల్ కిట్లు ఏర్పాటు చేశామన్నారు. డిపార్టుమెంటు నుంచి ముగ్గురు అధికారులను బస్సు ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. పది బస్సులకు ఒక నోడల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారన్నారు నరసరావుపేట, గుంటూరులో మహిళలకు 8, పురుషులకు 10 కేంద్రాలు ఏర్పాటుచేసినా 18 కేంద్రాల్లో రాత్రి బస ఉంటుందన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగించుకున్న అనంతరం యథావిధిగా కర్నూలుకు బస్సులు బయలుదేరుతాయన్నారు. డీఈవో శామ్యూల్‌పాల్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


తరలివచ్చిన అభ్యర్థులు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ సిరి



అటవీశాఖలో అవినీతి!

ఆత్మకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే సంచలనంగా మారిన అటవీశాఖ రిటైర్డు ఉద్యోగి చాంద్‌బాషా చేసిన అక్రమాలను పరిశీలిస్తే ఆశాఖలో అవినీతి హెచ్చుమీరినట్లు తెలుస్తోంది. ఈ అవకతవకల్లో కింది స్థాయి ఎఫ్‌బీవోల నుంచి ఐఎఫ్‌ఎస్ అధికారుల వరకు అడుగడుగున వారి పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఈ ఏడాది మే 19న ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. ఇందులో ఎస్ఎన్‌టీఆర్ ఎఫ్‌డీపీటీ బీ.ఏ.కృష్ణమూర్తి, విజిలెన్స్ డీఎఫ్‌ఓ ఎన్.శివకుమార్, నంద్యాల సర్కిల్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, ఆత్మకూరు, నంద్యాల డివిజన్లకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు చంద్రశేఖర రాజు, జీఎస్.రవికుమార్, రమేష్‌లను నియమించారు. అయితే వీరు చేపట్టిన విచారణలో రూ.7.5కోట్ల వరకు అక్రమాలు వెలుగుచూసినట్లు తెలిసింది. అయితే వాటికి సంబంధించి పూర్తిస్థాయిలో ఆధారాలు లభించకుండా చాంద్‌బాషా ఎక్కడికక్కడ తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో విచారణ బృందం అధికారులు సైతం తలలు పట్టుకుని తాము పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయలేమంటూ చేతులెత్తేసినట్టు సమాచారం.

- చాంద్‌బాషా వ్యవహారంలో ఆశ్చర్యపోయేలా అవకతవకలు
- వివిధ పథకాల నిధుల వినియోగంలో గోల్‌మాల్
- ఇప్పటివరకు రూ.7.5కోట్ల వరకు నిధులు దారి మళ్లింపు?
- రేంజ్‌ల పరిధిలోనూ.. అక్రమాల ఊడలు

ఆశ్చర్యపోయేలా అవకతవకలు

ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేసి గత ఏడాది జూలై నెలలో పదవీవిరమణ పొందిన చాంద్‌బాషా చేసిన అక్రమాల్లో ప్రధానంగా చెక్‌పోస్టుల నుంచి వచ్చిన సొమ్మును ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్), ఫారెస్టు డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎఫ్‌డీఏ) తదితర సంస్థలకు చెక్కులను ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసినప్పుడు మాత్రమే చేతివాటం ప్రదర్శించి ఆ చెక్కులను దారిమళ్లించినట్లు తొలుత అధికారులు గుర్తించారు. ఈ లెక్కన జూన్ 21వ తేదీ వరకు జరిగిన విచారణలో రూ.4.37కోట్ల వరకు నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆ తర్వాత కూడా చేపట్టిన విచారణలో చాంద్‌బాషా అటవీశాఖలోని వివిధ పథకాలకు సంబంధించి నిధుల విషయంలో కూడా గోల్‌మాల్ జరిగి మరో రూ.3కోట్లకు పైగా అక్రమాలు వెలుగు చూసినట్లు తెలిసింది. ఇందులో కింది స్థాయి అటవీ సిబ్బంది మొదలుకుని కొందరు రేంజర్లను కూడా భాగస్వాముల్ని చేసి నిధులను దారిమళ్లించినట్లు సమాచారం.

వివిధ పథకాల ద్వారా నిధుల కేటాయింపు

అటవీ శాఖ పరిపాలనలో పలు పథకాలను అమలు చేస్తుంటారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ కాంపన్సేటరీ ఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (ఏపీసీఏఎంపీఏ) పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తారు. అటవీ భూమి, పర్యావరణ వ్యవస్థ సేవలు నష్టపోయినట్లయితే పరిహారం ద్వారా అటవీకరణను పెంచడం, సహజ పునరుత్పత్తి సహాయంతో అడవుల నాణ్యతను మెరుగుపర్చడం, జీవ వైవిధ్యాన్ని సుసంపన్నం చేయడం, వన్యప్రాణుల ఆవాసాలను మెరుగుపర్చడం, అటవీ అగ్ని నియంత్రణ, అటవీ రక్షణ, నేల, నీటి సంరక్షణ కోసం ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులను మంజూరు చేస్తారు. అలాగే బయోశాప్ పథకం ద్వారా అడవుల్లో తెగుళ్ల నివారణ, వనరుల నిర్వహణ, అడవుల పరిరక్షణకు నిధులను కేటాయిస్తారు. ఇవేకాకుండా వనవిహారీ పథకంలో భాగంగా అటవీ సమీప గ్రామాల ప్రజలతో కలిపి వన సంరక్షణ సమితిల (వీఎస్ఎస్) లను ఏర్పాటు చేసి వీటికి నిధులను మంజూరు చేస్తారు. ఒక్క ఆత్మకూరు డివిజన్‌లోనే 48 వీఎస్ఎస్ కమిటీలను ఏర్పాటు చేసి వీటి ద్వారానే అడవుల్లో చెక్ డ్యామ్ నిర్మాణ పనులు, నీటికుంటలు, పూడిక తీత పనులు, మొక్కలు నాటడం, అడవుల్లో విత్తనాలు చల్లించడం తదితర పనులను చేపడతారు. అయితే ఈ పథకాలకు సంబంధించి కేటాయించిన నిధుల వినియోగంలో కూడా చాంద్‌బాషా గోల్‌మాల్ చేసినట్లు తెలిసింది.


చాంద్‌బాషా అక్రమాలపై విచారణ చేపట్టిన బృందం (ఫైల్)

మిగతా 9లో...

గిరిజనులు వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి మద్దిలేటి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మద్దిలేటి

ఆత్మకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గిరిజనులు వ్యవసాయంపై ఆసక్తి చూపి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మద్దిలేటి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని బైర్లూటి చెంచుగూడెంలో ధాత్రి అబ్‌జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ (డీఏజేజీయూఏ) ద్వారా అమలవుతున్న పథకాలను గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా రైతులకు భూసార పరీక్షలు నిర్వహించి సూక్ష్మ పోషక లోపాలు ఉంటే వారికి 90 శాతం సబ్సిడీపై జింకు, బోరాన్, ఐరన్, జిప్సమ్ వంటి సూక్ష్మపోషకాలను అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఒక్కో రైతుకు ఏటా రూ.6వేల సాయం అందిస్తున్నట్లు తెలిపారు. 90శాతం సబ్సిడీతో విత్తనాలను అందిస్తున్నామన్నారు. గిరిజన రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ హేమలత, ఉద్యానశాఖ ఏడీఏ బాలసుబ్రహ్మణ్యం, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ సర్జన్ అప్సర్ అలి, ఐటీడీఏ పీహెచ్‌వో సత్యనారాయణ, వైకేపీ ఏపీడీ నాయక్, ఐటీడీఏ ఎన్ఆర్ఈజీఎస్ స్పెషల్ ఆఫీసర్ కేజీనాయక్ పాల్గొన్నారు

పారదర్శకంగా సరఫరా చేయండి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎరువులు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల సరఫరా, ఈ పంట రికార్డింగ్, రైతుల రిజిస్ట్రేషన్, కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల జారీ, ప్రాజెక్టులకు భూముల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్యాక్స్ ద్వారా రైతులకు రసాయనిక ఎరువులు నేరుగా సరఫరా చేస్తామని లిఖితపూర్వక హామీఇచ్చిన ప్యాక్స్‌లకే అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 5.41లక్షల ఎకరాల్లో పంట సాగు చేయగా ఇప్పటివరకు 3.86లక్షల ఎకరాలు మాత్రమే నమోదు చేశారన్నారు. ఈ నెలాఖరులోపు ఖరీఫ్ పంటల బుకింగ్ పూర్తిచేయాలని వ్యవసాయ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. చాగలమర్రి, బనగానపల్లె, రుద్రవరం, గడివేముల మండలాల్లో అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్న నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 30వేల మంది కౌలురైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు కాగా, ఇప్పటివరకు 15,593మందికి పంపిణీ చేశామన్నారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు.


కర్నూలు మార్కెట్ యార్డులో అమ్మకానికి రైతులు తీసుకొచ్చిన ఉల్లి దిగుబడులు (ఫైల్)

ఎప్పుడిస్తారో?

- ధరలు పతనమై నష్టపోయిన ఉల్లి రైతులు
- మద్దతు ధర రూ.1,200 ప్రకటించిన ప్రభుత్వం
- 1.50 లక్షల క్వింటాళ్ల సేకరణ
- రైతులకు బకాయిలు రూ.15.18 కోట్లు
- ఉల్లి డబ్బు కోసం అన్నదాతల నిరీక్షణ

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు విస్తీర్ణం 45,278 హెక్టార్లు. ఈ ఏడాది ఈ-క్రాప్ రికార్డుల ప్రకారం 52,306 ఎకరాల (20,923 హెక్టార్లు)లో సాగు చేశారు. ఈ నెలాఖరుల వరకు ఈ-క్రాప్ నమోదుకు అవకాశం ఉండడంతో మరో 2-3 వేల ఎకరాలు పెరిగే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారుల అంచనా. క్వింటా కనిష్ఠంగా రూ.వంద కూడా పలకని పరిస్థితి. పంట కోత, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పలువురు రైతులు పొలంలోనే వదిలేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోకి కూటమి ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులకు అండగా నిలబడింది. మద్దతు ధర క్వింటాకు రూ.1,200 ప్రకటించింది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. సాగు పెట్టుబడి కాదని పంట కోత, రవాణా కోసం ఎకరాకు రూ.35-40 వేల వరకు అప్పులు చేశారు.

కొన్న ఉల్లికి డబ్బుల కోసం..

కర్నూలు మార్కెట్ యార్డులో ఆగస్టు 31న మద్దతు ధర రూ.1,200 ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్ నేరుగా ఉల్లి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ యార్డు లైసెన్స్‌డ్ వ్యాపారులు పర్చేజ్ డిఫరెంట్ ప్రైజ్ స్కీం (పీడీపీఎస్) కింద కొనుగోలు చేసిన ఉల్లి ధరపై వ్యత్యాసం అమౌంట్ (ఉదా: వ్యాపారికి క్వింటా రూ.350కు కొనుగోలు చేస్తే మిలిగిన వ్యత్యాసం డబ్బులు రూ.950 ప్రభుత్వం ఇచ్చేలా) ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏపీ మార్క్‌ఫెడ్ 69,390 క్వింటాళ్లు (6,939 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేసింది. రూ.8.12 కోట్లు, వ్యాపారులు పీడీపీఎస్ కింద 80,230 క్వింటాళ్లు (8,023 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేశారు. వ్యత్యాసం అమౌంట్ రూ.7.06 కోట్లు కలిపి రూ.15.18 కోట్లు ఉల్లి రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం రూ.2కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో జమ చేశారు. ప్రభుత్వం స్పందించి ఉల్లి కొనుగోలు డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. హెక్టారుకు రూ.50వేలు సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ డబ్బులు ఎప్పుడిస్తారో..? అని ప్రశ్నిస్తున్నారు.

మిగతా 8లో...

కవులు, కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి

- అరుణభారతీ సంస్థ వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి



యాగంటి పెయింటింగ్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ రాజారెడ్డి, చిత్రలేఖనం ఆర్టిస్ట్ లావణ్య

బనగానపల్లె, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు, రచయితలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం కల్పించాలని అరుణ భారతీ సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. లైవ్ పెయింటింగ్‌లో ప్రతిభ కనబరచిన ఆర్టిస్ట్ లావణ్యను బీసీ రాజారెడ్డి బుధవారం బనగానపల్లెలో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం భువనగిరికి చెందిన లావణ్య లైవ్ పెయింటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరచి అందరి ప్రశంసలు అందుకుంటోందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను, పుణ్యక్షేత్రాల ఆధ్మాతికత, ప్రకృతిలోని అందాలను చిత్రరూపంలో తెలియజేయాలనే ఉద్దేశంతో ఆమె పర్యటనలు చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటికి వచ్చిన లావణ్య క్షేత్రపరిధిలో సహజ సిద్ధంగా ఉన్న ఎర్రమల కొండలు, ఆలయ గోపురం, కోనేరు, ఉమామహేశ్వరస్వామి మూలవిరాట్, బసవేశ్వరస్వామి ఒకే చిత్రంలో కనిపించేలేలా కేవలం 4 గంటల్లోనే లైవ్ పెయింటింగ్ వేసి ఆశ్చర్యపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేడింగ్‌లో తీసేసిన ఉల్లినే పారబోశా..

- వీడియో తీసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు
- పందికోన రైతు కడవలరాజు



గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లిని ట్రాక్టర్‌తో పారబోస్తున్న దృశ్యం

పత్తికొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లినే పారబోసినట్లు పందికోన గ్రామానికి చెందిన రైతు కడవల రాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లిని పారబోయగా దీన్ని వీడియో తీసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు వాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న రెండెకరాల్లో ఉల్లి పంటను సాగుచేశానని, రెండు రోజుల క్రితం కోతకోసి గ్రేడింగ్ చేయగా 300 బస్తాలు (50 కిలోలు) దిగుబడి వచ్చిందన్నారు. దిగుబడి వచ్చిన ఉల్లిపంటను స్థానిక వ్యాపారులకు క్వింటం రూ700 అమ్ముకున్నానన్నారు. పొలంలో వేరేపంటను సాగుచేయాలన్న ఉద్దేశంతో గ్రేడింగ్‌లో అమ్మకానికి పనికిరాని ఉల్లిని బుధవారం ట్రాక్టర్ ద్వారా బయట పారబోశామన్నారు. ట్రాక్టర్ ద్వారా పారబోస్తున్న గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లిని వీడియో తీసుకున్న కొందరు వైసీపీ కార్యకర్తలు ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టుచేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు వాడుకుంటున్నారన్నారు.

తెర వెనుక వైద్యుడు

- ఔషధ తయారీ నిపుణులు
- వైద్య రంగంలో కీలకం ఫార్మసిస్టులు
- నేడు వరల్డ్ ఫార్మసిస్టు డే



రోగులకు వైద్యం చేసేది డాక్టర్లు.. రోగుల సేవల్లో కీలకపాత్ర పోషించేది ఫార్మసిస్టులు. మందుల తయారీ నుంచి డాక్టర్ ప్రిస్కిప్షన్ అర్థం చేసుకునే వరకు ఫార్మసిస్టులు కీలకం. అందుకే వీరిని తెర వెనుక వైద్యులని అంటుంటారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల తర్వాత ఫార్మసిస్టులు అత్యంత ముఖ్యమైన వారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్టుల సేవలను గుర్తించడానికి సెప్టెంబరు 25న ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ వరల్డ్ ఫార్మసిస్టుల డేను నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'ఆరోగ్యం గురించి ఆలోచించండి. ఫార్మసిస్టును గురించి ఆలోచించండి' అన్న నినాదాన్ని ఇచ్చింది. వరల్డ్ ఫార్మసిస్టుల డేను పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి' కథనం.

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే అందులో ఫార్మసిస్టుల పాత్ర కీలకం. మందులు నిత్యావసరాల జాబితాలో చేరిపోయాయి. బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, లివర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి నుంచి స్వల్ప అనారోగ్యాలకు గురైన వారి వరకు మందులను వినియోగిస్తారు. ఔషధాలను రాసేది వైద్యుడే అయినా వాటిని మోతాదులో.. ఎలా వినియోగించేది రోగులకు వివరించేది ఫార్మసిస్టులే.

ఉమ్మడి జిల్లాలో 12వేల మంది

కర్నూలు, నంద్యాల జిల్లాలో 12వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ వైద్య విధాన పరిషత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కర్నూలు జీజీహెచ్, ఏరియా ఆసుపత్రులు, రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు, 104 సెంటర్ డ్రగ్ స్టోర్‌లో ఫార్మసిస్టులుగా పని చేస్తున్నారు ఉమ్మడి జిల్లాలో 2,500 మెడికల్ షాపులు, హోల్‌సేల్ షాపులున్నాయి. వీటిని ఫార్మసిస్టులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు ఫార్మసి కాలేజీల నుంచి ఏటా 500 మంది ఫార్మసిస్టులు బయటకు వస్తున్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు

సాధారణంగా మెడికల్ షాపు బోర్డులపై కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అని రాసుకుంటారు. డాక్టర్ రాసే మందులు కాంబినేషన్లు అర్థం చేసుకునే వారు కనుక కెమిస్ట్ అని, మందుల గురించి అవగాహన కలిగిన వారు కాబట్టి డ్రగ్గిస్ట్ అంటారు.

ఇంటర్ బైపీసీ, ఎంపీసీ..

ఫార్మసిస్టు కావడానికి ఫార్మసీ కోర్సులను చేయాల్సి ఉంటుంది. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థుల మార్కుల ఆధారంగా ఫార్మసిస్టులు కేటాయిస్తారు. ఫార్మాసూటికల్ రంగంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ప్రొడక్షన్ కెమిస్ట్, ఎనలైటికల్ కెమిస్ట్, రెగ్యులర్ ఎఫైర్స్, ఇంటలెక్చువల్స్‌గా సేవలందిస్తున్నారు. ఆసుపత్రుల్లో క్లినికల్, కన్సల్టెంట్, వెటర్నిటీ ఫార్మసిస్టులుగా సేవలందిస్తున్నారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, అకడమిక్ అండ్ రీసెర్చ్‌గా కమ్యూనిటీ ఫార్మాసిస్టు, మిలిటరీ ఫార్మాసిస్టు, హోల్‌సేల్ అండ్ రిటైల్ ఫార్మాసిస్టులుగా సేవలందిస్తున్నారు.

అనుభవం అవసరం



కొత్త ఫార్మసిస్టులు ముందుగా అనుభవం తెచ్చుకోవాలి. రోగిని ప్రిస్కిప్షన్ ప్రకారం మందులు ఎలా వేసుకోవాలో వివరించాలి. గతంతో పోలిస్తే కొత్తగా ఫార్మసిస్టు కోర్సు పూర్తి చేసిన వారు స్వంతంగా మందుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇలాంటి షాపులకు ఆన్‌లైన్‌లో త్వరగా అనుమతులిస్తున్నాం.

- ఏటీవీ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ, కర్నూలు

ప్రజల ఆరోగ్యాన్ని..



ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైంది. వైద్యులు రాసిన మందులను అర్థం చేసుకుని సరైన వాటిని వ్యాధిగ్రస్తులకు ఇవ్వడం ఫార్మసిస్టులు చేస్తుంటారు. కర్నూలు నగరంలో 800 మెడికల్ షాపులున్నాయి. ఫార్మసిస్టులు మందులు ఎలా వాడాలో తెలిపి ఆరోగ్యాన్ని సంరక్షించడంలో తోడ్పడుతారు.

- పి.హనుమన్న, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు అర్బన్

ఫార్మసిస్టులు లేకుండానే దుకాణాలు

ఉమ్మడి జిల్లాలో 3వేల మందుల షాపులున్నాయి. సాధారణంగా ఫార్మసిస్టులకే మందుల దుకాణాల నిర్వహణకు అనుమతి ఇస్తారు. చాలా వాటిలో ఫార్మసిస్టులే ఉండటం లేదు. కొందరైతే ఫార్మసిస్టుల ద్వారా దుకాణానికి అనుమతులు తీసుకుంటూ స్వంతంగా నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సాధారణ ఆరోగ్య సమస్యలకు ఉపయోగించే మందులు కిరాణషాపుల్లోనూ విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీలు, ఫార్మసిస్టుల పాత్ర పోషిస్తూ వారిదగ్గరే మందులను ఉంచుకుని వైద్యసేవలందిస్తూ ప్రజలను తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తున్నారు.

ఎప్పుడిస్తారో?

7వ పేజీ తరువాయి..

ఉమ్మడి జిల్లాలో 2018లో కూడా ఇలాగే ఉల్లి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆనాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం కనీసం మద్దతు ధర రూ.700 నిర్ణయించి ఉల్లి కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ లైసెన్స్‌డ్ వ్యాపారులు కొనుగోలు ధరపై వ్యత్యాసం (డిఫరెంట్) అమౌంట్ బోనస్‌గా ఇస్తామని ప్రకటించింది. ఆ సంవత్సరంలో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఉల్లి సేకరించారు. తొలి విడతగా ఉల్లి బోనస్ అమౌంట్ రూ.25లక్షలకు పైగా రైతుల ఖాతాలో జమ చేశారు. కర్నూలు మార్కెట్లో ఆగస్టు నుంచి ఉల్లి అమ్మకాలు చేసిన రైతులు జాబితా సిద్ధం చేసి ఉల్లి బోనస్ రూ.6.25 కోట్లు చెల్లించాలని మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఆ నిధులు మంజూరు చేసే సమయంలో 2019 మార్చి 10న అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఉల్లి రైతులకు బోనస్ డబ్బులు విడుదల చేయలేదు. ఆ తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ రోజు వరకు ఆ డబ్బులు రాలేదు. నాటి బోనస్ డబ్బులు కూడా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అప్పులోళ్లకు ఏమని చెప్పాలి



రెండెకరాల్లో ఉల్లి సాగు చేశాను. ధరలు పతనం కావడంతో ఉల్లి పంట కోయాలా వద్దా..? అంటూ ఆలోచిస్తున్న సమయంలో ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించి భరోసా కల్పించింది. కొంతైనా చేతికొస్తుందనే ఆశతో పంట కోత, రవాణాకు మరో రూ.35 వేలకు పైగా అప్పు చేసి పంటను కర్నూలు మార్కెట్‌కు తీసుకెళ్లాను. క్వింటా రూ.1,200 ప్రకారం 86 క్వింటాళ్లు తీసుకున్నారు. నాకు రూ.1,06,200 రావాలి. 20 రోజులు దాటినా ఉల్లి అమ్మిన డబ్బులు రాలేదు. అప్పులోళ్లకు ఏమని సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే డబ్బులు ఇవ్వాలి.

- వెంకటేశ్వర్లు, ఉల్లి రైతు, తిమ్మందొడ్డి గ్రామం, సి.బెళగల్ మండలం

వెంటనే ఉల్లి డబ్బులు ఇవ్వాలి



ఎకరన్నర పొలంలో ఉల్లి సాగు చేశా. ప్రభుత్వం క్వింటా రూ.1,200 కొనుగోలు చేస్తుందంటే కొంతలో కొంతైనా ఆర్థిక కష్టాలు తీరుతాయని మరో రూ.35 వేలు అప్పు చేసి పంట కోసి 52 క్వింటాళ్లు మార్కెట్‌కు తీసుకెళ్లాను. నాకు రూ.62,400 రావాలి. 20 రోజులైనా ఇవ్వడం లేదు. ఆర్థికంగా ఎన్నో కష్టాలు పడుతున్నాం. ప్రభుత్వం రైతుల కన్నీటి కష్టాలు చూసైనా వెంటనే డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి. హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించిన సాయం కూడా కాలయాపన చేయకుండా తక్షణమే మంజూరు చేయాలి.

- మునిస్వామి, ఉల్లి రైతు, పోలుకల్లు గ్రామం, సి.బెళగల్ మండలం

'మునిరాజ మహేశ్వరం' కథల సంపుటి ఆవిష్కరణ



కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లౌకికత్వాన్ని ప్రతిబింబించేదే 'మునిరాజ మహేశ్వరం' కథల సంపుటి అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కథా రచయిత డాక్టర్ మనోహర్ కోటకొండ రాసిన 'మునిరాజ మహేశ్వరం' కథల సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కథల సంపుటిలోని కథలపై ప్రముఖ కవులు జి.వెంకటకృష్ణ, ఎస్ఎండీ ఇనాయతుల్లా, మారుతీ పౌరోహితం వక్తలుగా ప్రసంగించారు. కథల సంపుటి ఆవిష్కర్త రచయిత్రి డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ హిందూ ముస్లిం మైత్రి మత విద్వేషాల కాలంలో మూడు కథలు ప్రేమానుబంధాన్ని పెంచి లౌకికత్వాన్ని చాటే కథలుగా తెలుగు కథా సాహిత్యంలో ఆవిష్కరణ అయ్యాయని రచయితను అభినందించారు. సభాధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ కథలన్నీ కవితాత్మకంగా సాగుతాయని, కవి కథలు రాస్తే ఎలా ఉంటాయో అలా రాశారని చెప్పారు. రచయిత డాక్టర్ మనోహర్ కోటకొండ తన స్పందన తెలియజేస్తూ సాహిత్యం తన జీవితంలో ఒక భాగమైందని అన్నారు. ఇది సామాజిక మార్పు దిశగానే ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. సభలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు నాగేశ్వరాచారి, ఆవుల చక్రపాణి యాదవ్, విజయులు తనగల, ఆకెపోగు నాగరాజు, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, చౌశా, సుల్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సహస్ర దీపాలంకరణ



సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం ఆలయంలోని కామేశ్వరీదేవి ఆలయంలో యథావిధిగా ఋత్వికులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక యాగశాల మంటపంలో శరన్నవరాత్రి ఉభయదాతల చేత చండీ హోమంతో పాటు కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. సాయంత్రం 6 గంటల నుండి అలంకార మంటపంలో భక్తుల చేత సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. అనంతరం కామేశ్వరీదేవిని చంద్రఘంట దుర్గ అలంకారంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహం

- రాష్ట్రం నుంచి జాతీయస్థాయి పోటీలకు ఒక జట్టు ఎంపిక
- ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్‌రావు
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్ రావు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఒక మంచి జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి 13 జిల్లాలనుంచి 520మంది బాలబాలికలు హాజరయ్యారన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన బాలికలు, బాలుర జట్లనుంచి ఒక మంచి టీం ను ఎంపిక చేసేందుకు సీనియర్ పీడీలను నియమించామన్నారు. వీరు పరిశీలించి జాతీయ స్థాయి పోటీలకు ఒక టీంను ఎంపిక చేస్తారని తెలిపారు. అక్టోబరు 5న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మనరాష్ట్రం నుంచి ఎంపికైన జట్లు పాల్గొంటాయన్నారు. బాల బాలికలకు ఎమ్మిగనూరు, నందవరంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిఏర్పాట్లు చేశారన్నారు. స్థానికంగా బీవీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. బీవీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు, టీడీపీ నాయకులు కమ్మ మహేంద్ర, బగిడే నాగరాజు, కామర్తి మహేష్, పీఈటీలు రామాంజనేయులు, శ్రీనివాసులు, హనీఫ్, శ్రీరామ్, నరసింహరాజులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో బాలురు, నందవరం జడ్పీ హైస్కూల్ మైదానంలో బాలికల జట్ల మధ్య ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర జట్లలో ఫస్ట్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం, విశాఖపట్నం జట్ల మధ్య జరగగా 2-1 తేడాతో విశాఖపట్నం విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. రెండో క్వార్టర్ ఫైనల్‌లో శ్రీకాకుళం, నెల్లూర్ జట్లు తలపడగా నెల్లూరుజట్టుపై పెనాల్టీ షూటౌట్‌లో శ్రీకాకుళం జట్టు 6-5స్కోరు తేడాతో విజయం సాధించింది. మూడో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు, గుంటూరు జట్లు తలపడగా కర్నూలు జట్టు 3-0 స్కోర్‌తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. నందవరం జడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగిన బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి- శ్రీకాకుళం, అనంతపురం- గుంటూరు, కర్నూలు-చిత్తూరు, విశాఖపట్నం-కృష్ణ జట్లు తలపడ్డాయి. ఉత్తమ ప్రతిభకనబరచిన పశ్చిమగోదావరి, అనంతపురం, కర్నూలు, విశాఖపట్నం జట్లు విజయం సాధించాయి.



నంద్యాలలో కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



మద్దిలేటి స్వామి క్షేత్రంలో బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు



కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



ఆదోనిలో రాజ్మా సోయాబీన్స్‌తో అవ్వ అలంకారం



కర్నూలు గీతామందిరంలో నారాయణి అలంకరణలో అమ్మవారు

అన్నపూర్ణగా అమ్మవారు



ధైర్యలక్ష్మి అంకరణలో గోదాగోకులంలోని అమ్మవారు

కర్నూలు కల్చరల్ / గూడూరు/ ఆదోని టౌన్/ బేతంచెర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలు కర్నూలు నగరంలో సందడి చేస్తున్నాయి. మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వామహస్తంలో రసాన్న పాత్ర ధరించి ఆదిభిక్షువుగా యాచించవచ్చిన లయకారకుడైన విశ్వేశ్వరునికి భోజనం ప్రదానం చేస్తున్నట్లు దేవిని అలంకరిస్తారు. నగరంలోని వన్‌టౌన్ లోగల గీతామందిరంలో అమ్మవారు నారాయణి అలంకరణలో దర్శనమిచ్చారు.

మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారి శాలలో వాసవీదేవి అమ్మవారికి రాజ్యమాల దేవి అలంకరణ చేశారు.

నగరంలోని పూలబజార్ సమీపంలోగల చిన్న అమ్మవారిశాల, వన్‌టౌన్‌లోని చిత్తారివీధిలోగల నిమిషాంబ, వన్‌టౌన్ కాళికాంబ, కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. మామిదాలపాడులోగల శ్రీగోదాగోకుల క్షేత్రంలో అమ్మవారికి ధైర్యలక్ష్మిగా కనిపించారు.

- గూడూరు మండలం కె.నాగలాపురం సుంకులా పరమేశ్వరీ దేవి అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, మంగళహారతి, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ రాధాకృష్ణ గ్రామపెద్దలు గోపాల్‌రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ పర్యవేక్షించారు.
- ఆదోని పట్టణంలోని లక్ష్మమ్మ అవ్వ దేవాలయంలో బుధవారం రాజ్మా, సోయాబీన్స్‌తో చేసిన అలంకారంలో అవ్వ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.
- బేతంచెర్ల మద్దిలేటి స్వామి క్షేత్రంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారు బుధవారం బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బ్రహ్మచారిణి అలంకారంలో చౌడేశ్వరీమాత

బనగానపల్లె: నందవరం గ్రామంలో కొలువైన చౌడేశ్వరీమాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం చంద్రఘట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీవీ కుమార్ రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహోబిల నృసింహుడికి ప్రత్యేక పూజలు



స్వామి,అమ్మవార్లకు పూజలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నరసింహస్వామికి ప్రత్యేక పూజలు, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నృసింహుడిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన నాగ ఉదయ్ కుమార్ కుటుంబ సభ్యులు ఉత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

అటవీశాఖలో అవినీతి..!

(7వ పేజీ తరువాయి)

నిధుల గోల్‌మాల్ ఇలా..

అడవులు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా భారత ప్రభుత్వం ప్రతి ఏటా ఆయా పథకాల నిధులను సర్కిళ్లకు కేటాయించడం జరుగుతోంది. ఇందులో భాగంగా నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యానికి సంబంధించి ఆ పథకాల నిధులు చేరవేయబడతాయి.


విచారణ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 330 మంది ప్రొటెక్షన్‌వాచర్లు, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా తదితర ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరికి జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర అలవెన్స్‌లతో కలిసి ప్రతినెల రూ.50 లక్షల వరకు ఖర్చవుతోంది. అదేక్రమంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం ఆయా నెలల అవసరాలను బట్టి నిధుల వినియోగం ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ బిల్లులు సకాలంలో అందని కారణంగా ఆయా పథకాల ద్వారా సర్కిల్ ఆఫీసు వారు డివిజన్ కార్యాలయాలకు అప్పుగా సొమ్మును ఇవ్వడం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే సర్కిల్ కార్యాలయం నుంచి ఆయా పథకాల (ఏపీసీఏఎంపీఏ, బయో శాప్, వీఎస్ఎస్) అమలు కోసం ఖర్చు చేసిన నిధుల తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంలో కూడా చాంద్‌బాషా గోల్‌మాల్ చేసినట్లు విచారణ బృందం దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో సర్కిల్ ఆఫీసు నుంచే వచ్చే సొమ్మును రేంజ్‌లకు చెల్లించడంలోనూ, రీఫండ్‌లోనూ చేతివాటం ప్రదర్శినట్లు సమాచారం. ఆయా పథకాల ద్వారా చేయని పనులకు, నాణ్యత లేని మొక్కుబడి పనులకు కూడా బిల్లులు తయారు చేసి ఇందులో రేంజర్లకు, కింది స్థాయి సిబ్బందికి వాటాలు ఇచ్చి నిధులు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. అయితే ఆయా పనులను ఉన్నతాధికారులు పరిశీలించిన దాఖలాలు కూడా లేవని తెలిసింది. అదేక్రమంలో సర్కిల్ ఆఫీసుకు రీఫండ్ చేసే క్రమంలో కూడా చెక్కులను దారిమళ్లించినట్లు సమాచారం. అయితే ఎన్ఎస్‌టీఆర్ సర్కిల్ ఆఫీసు వారు కూడా నిధుల మంజూరు తర్వాత రీఫండ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చాంద్‌బాషా దర్జాగా అక్రమలు సాగినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆధారాలను సేకరణలో తలమునకలు

చాంద్‌బాషా చేసిన అక్రమాలను గుర్తించేందుకు విచారణ బృందం సైతం తలమునకలైనట్లు తెలుస్తోంది. అటవీ చెక్‌పోస్టుల అక్రమాలను సులువుగానే గుర్తించినప్పటికీ ఆయా పథకాల అక్రమాల ఆధారాలను పూర్తిస్థాయిలో గుర్తించడం కష్టతరంగా మారింది. ఇప్పటికే ఆత్మకూరు అటవీ డివిజన్ వారు బ్యాంకు లావాదేవీలు జరిపే యూనియన్ బ్యాంక్ ఆత్మకూరు బ్రాంచ్ నుంచి పలు ఆధారాలను సేకరించారు. మరిన్ని చెక్కులు, నెఫ్ట్‌ఫారాలు, ఇతర పత్రాల కోసం తిరుపతి రీజనల్ ఆఫీసు వారిని సంప్రదించినట్లు తెలిసింది. దీంతో అధికారులకు ఈ సమస్య మరింత జఠిలమైంది. అయితే చాంద్‌బాషా అవినీతి అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచక విచారణ బృందం తలలు పట్టుకున్నట్లు తెలిసింది. తమ రెగ్యూలర్ ఉద్యోగాలు చేస్తూ.. ఈ విచారణ చేయడం సాధ్యం కావడం లేదని అప్పటివరకు తయారు చేసిన నివేదికలను ఈ నెల 16వ తేదీన పీసీసీఎఫ్ వీ.చలపతిరావుకు అందజేశారు.

రికవరీ ఎలా?

చాంద్‌బాషా అక్రమాల వ్యవహారం అటవీశాఖకే పెనుసవాల్‌గా మారింది. అసలు ఈ సమస్యకు పరిష్కారం ఏమిటన్నది కూడా ఆ శాఖ అధికారులకు అంతుచిక్కడం లేదు. పథకాల అమల్లో చాలా మంది అటవీ సిబ్బంది, ఉద్యోగులను ఇందులో భాగస్వాములు కావడం గందరగోళానికి దారితీస్తోంది. అదేక్రమంలో చాంద్‌బాషా స్వాహా చేసి సొమ్మును ఏవిధంగా రికవరీ చేయాలన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలావుంటే ప్రస్తుతం చాంద్‌బాషా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన్ను ఈ నెల 17 నుంచి 21 వరకు ఆత్మకూరు పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అయితే ఆయన విచారణకు పూర్తిస్థాయిలో సహకరించలేదని తెలిసింది. ఏదిఏమైనా.. చాంద్‌బాషా వ్యవహారంతో అటవీశాఖకు కనువిప్పు కలిగిందని చెప్పవచ్చు. ఇలాంటి అక్రమాలకు భవిష్యత్ తావు లేకుండా అటవీశాఖలో పకడ్బందీ చర్యలకు ఆశాఖ అధికారులు శ్రీకారం చుడుతున్నట్లు తెలిసింది.

వేతనాలొచ్చేనా..!

- సమగ్రశిక్ష ఉద్యోగుల ఎదురుచూపులు
- పండుగ పూట పస్తులేనా?
- బడ్జెట్ వస్తేనే వేతనాలంటున్న అధికారులు
- కూటమి ప్రభుత్వంలోనూ తప్పని కష్టాలు


ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు(ఫైల్)

ప్రభుత్వాలు మారినా సమగ్రశిక్ష ఉద్యోగుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీ రాగానే వేతనాలు అందుతున్నాయి. సమగ్ర శిక్ష ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం బడ్జెట్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. సెప్టెంబరు నెల ముగియడానికి వచ్చినా ఇంతవరకు వేతనాలు అందలేదు. ఇంటి అద్దెలు, పిల్లల పోషణ భారంగా మారుతుందని వాపోతున్నారు.

ఆలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేసే ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తుంది. సంబంధిత శాఖల హెచ్‌వోడీల ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు జమచేస్తూ ఔట్ సోరిసంగ్ ఉద్యోగు లకు ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) ద్వారా వేతనాలు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు జమ అవుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 550మందికి పైగా..

కర్నూలు జిల్లాలో ఆశాఖ పరిధిలో ఉన్న కేజీబీవీల్లో సీఆర్టీలు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎంఆర్‌సీలలో ఆర్పీలు, మెసెంజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌం టెంట్లు, మోడల్ హాస్టల్ వార్డెన్లు, పార్ట్ టైం ట్యూటర్లు, వంట చేసేవారు, వాచ్ మెన్‌లు, మెసెంజర్లు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, భవిత భవన్‌లలో ఎంఈఎస్ ఆర్డినేటర్లు, సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది ఇలామొత్తం 550 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం కలిపి నిధులు కేటాయిస్తారు. ఒకటో తేదీ వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాట య్యాక సక్రమంగా వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు అవే కష్టాలు తప్పడం లేదంటున్నారు. చిరుద్యోగుల వార్షిక బడ్జెట్‌ను విడుదల చేసి ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

వార్షిక బడ్జెట్ విడుదల చేయాలి



సమగ్రశిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు చెల్లించేందుకు వార్షిక బడ్జెట్‌ను విడుదల చేయాలి. దసరా పండగ కావడంతో వేతనాలు లేక చిరుద్యోగులు ఇబ్బందులు పడు తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి న్యాయం చేయాలి.

● మహమ్మద్‌రఫీ, సమగ్రశిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ స్టేట్ కో చైర్మన్

బడ్జెట్ వచ్చాకే వేతనాలు



సమగ్రశిక్ష నుంచి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాల బడ్జెట్ విడుదల కాలేదు. అందుకే ఆలస్యమవుతుంది. ఉన్నతాధికారులకు కూడా వేతనాల కోసం విన్నవించాం. బడ్జెట్ రాగానే వేతనాలు జమ చేస్తాం.

● శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

పొలాల్లో గంజాయి సాగుపై నిఘా పెట్టాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి
- 250 పాఠశాలల్లో ఈగల్ టీమ్‌ల ఏర్పాటు : ఎస్పీ విక్రాంత్ పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో గంజాయి సాగుపై అధికారులు నిఘా పెట్టాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్కోర్డు సమావేశం నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాలుతూ ప్రజలు, పాఠశాలలు, కాలేజీ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తే వాటి వినియోగం, రవాణాను అరికట్టడం సాధ్యమన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి అనుబందంగా ఉన్న డిగ్రీ కాలేజీలలో సోమవారంలోపు ఈగల్‌టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది బస్సుల్లో ప్రయాణీకులత పార్సిల్స్‌ను జాగ్రత్తగా గమనించాలని, కొరియర్ సర్వీసుల విషయంలోనూ జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 250 పాఠశాలల్లో ఈగల్ టీమ్‌ల ఏర్పాటు చేశామన్నారు. పెద్దతుంబళం గ్రామంలో గంజాయిని అంతర పంటగా సాగు చేస్తుండగా గుర్తించి 3.5కేజీల గంజాయిని స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. మత్తు పదార్థాలను రవాణా చేస్తే ఎన్‌డీపీఎస్-47 చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఈడీ మైనారిటీస్ సబీహా పర్వీన్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసు

ఇసుకను అక్రమంగా తరలించేవారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మైనింగ్ అధికారి రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి కోసం పాట్లు


రైలు పట్టాలపై శవాన్ని తీసుకెళ్తున్న గణ్ణేకల్లు గ్రామస్థులు

ఆ గ్రామంలో శ్మశాన ఆఖరి(అంత్యక్రియలు) కార్యక్రమం చేపట్టడానికి కూడా పాట్లు తప్పడం లేదు. ఆదోని మండలం గణ్ణేకల్లులో శ్మశాన వాటికకు దారిలేదు. ఆ గ్రామంలో మరణించిన వారిని శ్మశాన వాటికకు తీసుకెళ్లాలంటే ప్రాణాలు తెగించి పాడి మోసుకొని రైలు పట్టాలను దాటాల్సిందే. ఈ క్రమంలో పలువురు ప్రాణాలు కూడా కోల్పో యారు. ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అధికారులు కానీ ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. బుధవారం గ్రామానికి చెందిన మేస్త్రీ పెద్ద లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు తీసుకెళ్లడా నికి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. మార్గమధ్యలో రైలు పట్టాలు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు.

● ఆదోని రూరల్, ఆంధ్రజ్యోతి

న్యాయ సేవాధికార సంస్థలో గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది బుధవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్ తరుపున డా.రాయపాటి శ్రీనివాసులు పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకాలను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది చేతుల మీదుగా డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, సులోచనకు అందజేశారు.

రెండు డెంగీ కేసులు నమోదు

ఎమ్మిగనూరు రూరల్/ గోనెగండ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. మండల కేంద్రమైన గోనెగండ్ల సచివాల యం 2లో బుధవారం ఓ డెంగీ కేసు నమోదు కాగా డెంగ్యూ కేసు నమోదు అయ్యింది. రోగి ఇంటి పరిసరాల్లో దోమలు, ఈగలు రాకుండా ఉండేందుకు గాను దోమల నివారణ మందును పిచికారి పంచాయతీ సిబ్బంది చేశారు. ఎమ్మిగనూరు మండలంలోని వెంకటగిరికి చెందిన బోయ మధు, మహాలక్ష్మిల ఐదేళ్ల కుమారుడు చాణక్య కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రక్త పరీక్షలు చేయించగా డెంగీ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. రక్తకనాలు తగ్గడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు లీగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెంది ఉండి, పది సంవత్సరాల ప్రాక్టీసు అనుభవం ఉన్న న్యాయవాదులు ఈ పోస్టుకు అర్హులన్నారు. క్రిమినల్ కేసులలో ప్రాక్టీసు ఉన్న న్యాయవాదులకు ప్రాధాన్యమిస్తున్నామనీ ఆయన తెలిపారు. దరఖాస్తు ఫారంను జిల్లా కోర్టు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 26వ తేదీలోపు చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు జిల్లా కోర్టుకు పంపుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డీఐజీగా పి.విజయలక్ష్మి

కల్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి డీఐజీగా పి. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ప్రభుత్వం ఇక్కడకు నియమించింది. ఇక్కడ పనిచేసిన పీజీఎస్.కళ్యాణి విశాఖపట్నం టూరిజం శాఖకు డిప్యుటేషన్‌పై బదిలీ కావడంతో ఆమె బుధవారం రిలీవ్ అయినట్లు ఉద్యోగులు తెలిపారు.

మిద్దె కూలింది.. ప్రమాదం తప్పింది

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదవాడలో గ్రామంలో బుధవారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శేఖర్‌కు చెందిన మట్టి మిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలడంతో పెను ప్రమాదం తప్పింది. శేఖర్ కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇంటికి వెళ్లడంతో మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరని, కట్టుబట్టలతో మిగిలామని బాధితుడు వాపోయాడు. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

దొంగతో కలిసి కానిస్టేబుల్ ప్లానింగ్

- రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లలో చోరీలు
- అనుమానం రాకుండా భార్య ద్వారా చోరీ సొత్తు విక్రయం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అసలు పోలీసులకు ఏమైంది.. మొన్నటికి మొన్న కోడుమూరులో పనిచేసే ఓ కానిస్టేబుల్ పలు కేసుల్లో సీజ్ చేసిన బైకులను అమ్మేసుకున్నాడు. ఇప్పుడు మరో పోలీసు దొంగతో జతచేరి చోరీలకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు నెలల తర్వాత ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈచోరీ కేసులో అసలు దొంగ కానిస్టేబులే అని గుర్తించి విస్తుపోయారు. ఆ దొంగతో పాటు కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని కొంత సొత్తును రికవరీ చేశారు. సీఐ విక్రమసింహ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కల్లూరులో తెలుగు వీధిలో కారు డ్రైవర్‌గా పనిచేసే గురుస్వామి అనే వ్యక్తి ఇంట్లో ఈ ఏడాది ఫిబ్రవరి 19న చోరీ జరిగింది. పట్టపగలే చోరీ జరగ్గా సుమారు 11తులాల బంగారు ఆభర ణాలు, కొంత నగదు చోరీ జరిగింది. అదేరోజు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఫింగర్ ప్రింట్స్ సేకరించినా కేసు నమోదు చేయలేదు. ఆ తర్వాత బాధితుడు పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సబ్ జైలు నుంచి విడుదలైన నిందితుల వివరాలు సేకరించి వారి సెల్‌ఫోన్లు, సాంకేతిక పరిజ్ఞానంతో ఆరా తీయగా గుడివాడకు చెందిన జగదీశ్ అనే నిందితుని కదలికలు ఈ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. అతని అదుపులోకి తీసుకుని విచారిస్తే గుట్టు రట్టయింది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్నారు. ఈక్రమంలో గురుస్వామి చెందిన ఇళ్లను తాళం వేసినట్లుగా గుర్తించాడు. వెంటనే జగదీష్ ఆఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు నగదు చోరీచేశాడు. ఆ సొత్తును కానిస్టేబుల్ కృపానందంకు ఇచ్చాడు. ఎవరికి అనుమానం రాకుండా తన భార్య ద్వారా చోరీ సొత్తును విక్రయించేవాడని పోలీసుల విచారణలో తేలింది. కానిస్టేబుల్ గత ఆగస్టులో ఓ దొంగతనం కేసులోనే ప్రకాశం జిల్లా కంభం పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అప్పటినుంచి ఆయన సస్పెన్షన్‌లో ఉన్నాడు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి 6 తులాల బంగారు నగలు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. కృపానందం వాడిన పల్సర్ బైక్‌ను కూడా సీజ్‌చేశారు. కేసు ఛేదిం చడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ షాకీర్, కానిస్టేబుళ్ల ఎల్లా శివుడు, సుబ్బరాయుడును ఉన్నతాధికారులు అభినందించారు.

దొంగతో కానిస్టేబుల్ చట్టాపట్టాలు

కర్నూలు రెండో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృపానందం ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో పలువురు నిందితులకు ఎస్కార్ట్‌గా వెళ్లేవారు. ఈక్రమంలో కృష్ణాజిల్లా గుడివాడ సితారా సెంటర్‌కు చెందిన జగదీష్ అనే దొంగతో పరిచ యం ఏర్పడింది. ఈ క్రమంలో దొంగతనాలు ఎలా చేయాలో.. ఎలా చేసేవారో అతని ద్వారా తెలుసుకు న్నాడు. జగదీష్ బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత పలు సార్లు అతనితో కలిసి ఎన్నో ప్రణాళికలు రూపొందించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జగదీష్‌ను కర్నూలుకు పిలిపించాడు. తన పల్సర్ బైక్‌పై ఎక్కిం చుకుని పలు కాలనీల్లో మూడు, నాలుగు రోజుల పాటు రెక్కీ నిర్వహించాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గడివేముల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరటమద్ది గ్రామానికి చెందిన బాలవెంగమ్మ (60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు బాలవెంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 14న పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోకపోవడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

హాలహర్వి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూటర్ అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాలు.. హాలహర్వికి చెందిన లక్ష్మి, మల్లికార్జున బైక్‌పై ఆలూరుకు వెళ్తున్నారు. బుధవారం బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మి మృతిచెందింది. మల్లికార్జునకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-దూపాడు రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వేపోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు వయసు 35 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై లేత నీలం రంగు షర్టు, బూడిద కలర్ పారాగాన్ చెప్పులు ఉన్నాయి. ముదురు నీలం రంగు డ్రాయర్, జోష్ డిక్సెసీ స్కాట్ అక్షరాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించారు. ఆచూకి తెలిసిన వారు సీఐ శ్రీనాథ్ రెడ్డిని 9908889696 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుమందు తాగి యువకుడు..

రుద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పెద్దకంబలూరులో బుధవారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన అబ్దుల్లా (26) అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు స్థానికులు సహకరించలేదు. దీంతో ఎస్ఐ, మరో కానిస్టేబుల్ శవాన్ని వాహనంలో చేర్చారు. నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు మృతదేహానికి అప్పగించారు. మృతుడి తల్లి మహ్మద్‌బీబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్ బస్సుకు జరిమానా

డోన్ రూరల్/క్రిష్ణగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమకతాడు టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున ఆర్టీవో అధికారులు తనిఖీలు చేశారు. రోడ్ ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా విధించారు. బెంగుళూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పల్వంచకు వెళ్తున్న ట్రావెల్ బస్సును తనిఖీచేసి రోడ్‌ట్యాక్స్ కట్టనందుకు రూ.3.73లక్షలు జరిమానా విధించామని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో నంద్యాల అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఆర్టీవో అధికారులు

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గడివేముల, తలముడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య అధికారులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లోని ఓపీ విభాగం, అక్కడున్న రోగులకు అందేసేవలు, చికిత్స, మందులు, రోగులపట్ల వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును పరిశీలించారు. ప్రజలకు అవగాహన కోసం ఐఈసీ మెటీరియల్ ప్రదర్శన అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలన్నారు. వీలైనంతవరకు సాధారణ కాన్పులు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. బాలింతలకు, పుట్టిన శిశువుకు అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే కింద వారికి రావాల్సిన రాయితీలు సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు.

మిడుతూరు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తలముడిపి ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడి రోగులను వైద్య అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి మద్దిలేటి, సూపర్‌వైజర్లు మమేశ్వర రెడ్డి, కిరణ్ కుమారి, మీనాక్షి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో 'ఆర్జీఎం'

పాణ్యం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు చోటుదక్కించుకున్నట్లు కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాలోని ప్రముఖ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రతి యేటా ప్రపంచంలోని శాస్త్రవేత్తల్లో రెండు శాతం మందిని అత్యంత ప్రతిభగల శాస్త్రవేతలుగా గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగా స్టాన్‌ఫోర్డ్ బుధవారం విడుదల చేసిన శాస్త్రవేత్తల జాబితాలో 2024- 25 సంవత్సరానికి గాను ఆర్జీఎం కళాశాలకు చెందిన డాక్టర్ పి.సుదర్శనరెడ్డికి మెకానికల్ ఇంజనీరింగ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో 966వ ర్యాంకు, డాక్టర్ పి. శ్రీదేవికి మెకానికల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో 1062వ ర్యాంకు, డాక్టర్ ఉపేంద్రరజాక్‌కు ఎనర్జీ విభాగంలో 2977వ ర్యాంకు, డాక్టర్ బి.జమాలయ్యకు అప్లైడ్ ఫిజిక్స్ విభాగంలో 4138వ ర్యాంకు, డాక్టర్ కె.వెంకటకృష్ణకు అప్లైడ్ ఫిజిక్స్ విభాగంలో 6376వ ర్యాంకు వచ్చింది. ఈ సందర్భంగా అధ్యాపకులను ఆర్జీఎం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.శాంతిరాముడు, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ రామిరెడ్డి అభినందించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

బండిఆత్మకూరు సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమానికి కృషిచేయాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌కు శ్రీశైల ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, మండల సీనియర్ టీడీపీ నాయకుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ కోరారు. బుధవారం అమరావతిలో ఛైర్మన్‌ను కలిసి సత్కరించారు. బ్రాహ్మణులు ఆర్థికంగా ఎంతో వెనకబడ్డారని, వారికి కార్పొరేషన్ ద్వారా రుణాలు, సహకారం అందించాలన్నారు.

మందకృష్ణ సభను జయప్రదం చేయాలి

బండిఆత్మకూరు సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాదిగలు ఈనెల 12న నంద్యాల జిల్లాలో జరిగే ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ సభను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు వెంకటసుబ్బన్న పిలుపునిచ్చారు. బుధవారం బండిఆత్మకూరులో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. గ్రామాల నుంచి మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, సుబ్బరాయుడు, దర్గయ్య, బాలస్వామి, చిట్టెన్న, వెంకటయ్య, మద్దయ్య, దశరథుడు, ఎర్రమల పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు తాపాలి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు తాపాలని సీడీపీవో చంద్రకళ తెలిపారు. బుదవారం పట్టనంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసం పురస్కరించుకుని తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీహెచ్‌సీ సూపరింటెంట్ డాక్టర్ రాయుడు, శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసన్నలక్ష్మి, కవిత, చిరంజీవి, షౌకత్, ఇక్బాల్, మస్తాన్, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, ఎస్‌టీఎల్ఎస్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

● భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు

నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు బుధవారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఆత్మకూరులో చంద్రఘంటాదేవి అలంకరణలో వాసవీమాత



నంద్యాల: సంజీవనగర్‌లో చంద్రఘంటాదేవిగా..



బ్రహ్మనందీశ్వర ఆలయంలో గిరిజాదేవిగా..



నంద్యాల : జగజ్జననీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులు



మద్దిలేటి స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో దుర్గమ్మ



గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారు



జూపాడుబంగ్లా : చంద్రఘంటాదేవి అలంకరణలో సరస్వతీదేవి



పాములపాడు:అన్నపూర్ణ దేవి అలంకారంలో అమ్మవారు



పాణ్యం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పార్వతీదేవిగా..



బండిఆత్మకూరు: గాయత్రిగా ఉమామహేశ్వరీ దేవి



పడిద్యాల: నెహ్రూనగర్‌లో అన్నపూర్ణదేవి అలంకరణలో దుర్గామాత



పాణ్యం: ఆలమూరులో కూరగాయల అలంకారంలో అన్నపూర్ణదేవి



ఆత్మకూరు: కిషన్‌సింగ్ వీధిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గాదేవి



గడివేముల:గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



కొత్తపల్లి: అన్నపూర్ణదేవి అలంకరణలో..



మహానంది: చంద్ర ఘంట దుర్గ అలంకారంలో కామేశ్వరీదేవి అమ్మవారు



వెలుగోడులో లలితాదేవి అలంకరణలో అమ్మవారు



నందికొట్కూరు : చౌడేశ్వరి దేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..

అంగీకార్ కార్యక్రమాన్ని వినియోగించుకోండి

● హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ హరి గోపాల్

నందికొట్కూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉన్నవారు కొత్త ఇంటి నిర్మాణం కోసం పీఎంఏవై 2.0 కింద అంగీకార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ హరి గోపాల్ కోరారు. బుధవారం మున్సిపాల్టీ ఆవరణలో పీఎంఏవై 2.0 కింద అంగీకార్ ప్రోగ్రాం కొత్తగా ఇల్లు నిర్మించుకునే హౌసింగ్ బెనిఫిట్స్ కోసం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పీడీ మాట్లాడుతూ అంగీకార్ కార్యక్రమం ద్వారా ఇంటి స్థలం ఉన్న ప్రతి ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకునేందుకు అర్హులన్నారు. అవసరమైన వారు హౌసింగ్ కార్యాలయంలో తమ వివరాలను ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బేబి, హౌసింగ్ డీఈ, ఏపీ టిట్కో సీఎల్డీసీ రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి సీనియర్ విభాగంలో దేవానంద్, సుభాష్, సబ్ జూనియర్ విభాగంలో ధర్మతేజలు ఎంపికైనట్లు జిల్లా బాల్‌బాడ్మింటన్ సంఘం చైర్మన్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26నుంచి 30వరకు తమిళనాడు రాష్ట్రంలోని దిండిల్‌లో జరిగే జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారన్నారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన వాహనం

● 15మందికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



ఘటనా స్థలం వద్ద గుమిగూడిన ప్రజలు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తంగడంచ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధ వారం సాయంత్రం కూలీల ఆటోను వాహనం ఢీకొన్న ఘటనలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తాటిపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పారుమంచాల పొలిమేరలో పచ్చిమిరపకాయలు కోయడానికి ఆటోలో వెళ్లారు. సాయంత్రం పనిముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా తంగడంచ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఢీకొనడంతో స్థానికంగా పొలాల్లో ఉన్న రైతులు, రహదారిపై వెళుతున్న వాహనదారులు చెల్లచెదురుగా పడి ఉన్న క్షతగాత్రులను 108 వాహనాలకు సమాచారం అందించి నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా చేశారు. తీవ్రంగా గాయపడిన వారిలో నీలమ్మ, జయమ్మ, దర్గమ్మ, కర్ణమ్మ, గంగమ్మ, మహేశ్వరమ్మ, సుశీలమ్మ, మంగమ్మ, శివరత్నమ్మ, రాణెమ్మ, లావణ్య, జిలేఖాబీ, సుబ్బమ్మ, హుసేన్‌బీతో పాటు ఆటోడ్రైవర్ రాఘవేంద్ర ఉన్నారు. నీలమ్మ, జయమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని జూపాడుబంగ్లా ఎస్‌ఐ మల్లికార్జున పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జాం



నల్లమల ఘాట్‌లోని ప్రధాన రహదారిలో నిలిచిన వాహనాలు

మహానంది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని బొగద ప్రధాన మలుపు వద్ద బుధవారం ఒక వాహనం నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ జాం అయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బెంగళూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న భారీ క్రేన్ నల్లమల అటవీ ప్రాంతంలోని మలుపు తిరిగే సమయంలో ప్రధాన రహదారికి అడ్డంగా నిలిచి పోయింది దీంతో గిద్దలూరు వైపు నుంచి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. గిద్దలూరు, మహానంది పోలీసులు అక్కడికి చేరుకొని మూడు గంటలపాటు శ్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రపంచస్థాయి నాయకుడు మోదీ : బీజేపీ

నందికొట్కూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాయకుడిని కాదు.. సేవకుడిని అని చెప్పుకుంటూ నిరంతరం దేశ ప్రజల కోసం పాటు పడుతున్న మహానేత నరేంద్ర మోదీ అని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు కొనియాడారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాస గౌడ్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్‌ల ఆధ్వర్యంలో మోదీ జన్మదినోత్సవం, ఘనసేవా పక్షోత్సవాల సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిరుచి మధు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో నంద్యాల జిల్లాను బీజేపీకి కంచుకోటగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ కార్యాలయాలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు స్థిరమైన కేంద్రాలుగా మారుస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీకి కేటాయించిన సీట్లలో ఆ ప్రాంతాల్లో తప్పకుండా బీజేపీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ ముస్లిం మైనార్టీ మహిళా నాయకురాలు షబానా, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, గూడూరు రవికుమార్, మండల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానందిలో సినీ నిర్మాత పూజలు

మహానంది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో తెలుగు సినీ నిర్మాత, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆల్తూరి మహేశ్వరరెడ్డి బుధవారం సాయంత్రం పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వీరికి టెంపుల్ పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాను ఎలాంటి నూతన సినిమా ప్రాజెక్ట్‌ను ప్రారంభించలేదన్నారు. తన తండ్రి స్వర్గీయ ఆదినారాయణరెడ్డి మహానంది క్షేత్రంలో చిరస్థాయిగా నిలిచే అభివృద్ధి పనులను చేపట్టారన్నారు.

సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజసేవలో యువత భాగస్వాములు కావాలని, అప్పుడే వారిలో కూడా మానవ సంబంధాలు తెలుస్తాయని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జీ.కృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్‌డే) దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివారులోని ఆర్డీటీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆర్డీటీ కాలనీవాసులతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. 2011-13 సంవత్సరంలో నిర్మించిన ఆర్డీటీసీ కాలనీలో 300 గృహాలు నిర్మించినప్పటికి ప్రస్తుతం 70 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నారన్నారు. అయితే అక్కడ సరైన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు హర్షణీయం

గోస్పాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ బీమా పాలసీలపై జీఎస్టీ రద్దుచేయడం హర్షణీయమని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ ఫెడరేషన్ ఆఫ్ సౌత్ ఇండియా సెంట్రల్ జోన్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఏజెంట్ల కృషి నేటికి ఫలించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 22 నుంచి జీఎస్టీని తొలగించిందన్నారు. తద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందని, తక్కువ ప్రీమియంతో బీమా చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో కురిసిన భారీ వర్షాలతో పాటు అడవి పందుల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకులు వీరన్న, కేవీ రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల పొలాల్లో వర్షపునీరు నిలిచి పంటలు పూర్తిగా దెబ్బతి నడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

ర్యాలీకి అందరూ సహకరించాలి

పాణ్యం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీకి అందరూ సహకరించాలని టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మద్దూరులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయ ఆవరణలో పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటారు.

ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

నంద్యాల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సచివాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నంద్యాలలో అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం, పార్టీ బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భూమి పూజ

పాములపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు ఉపసర్పంచ్ నరసింహులు, వార్డు మెంబర్లు, లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆవుల నారాయణరెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తెలుగుగంగ నుంచి మోటార్ల ద్వారా బనకచెర్లలోని ట్యాంక్‌కు ఎక్కించి పైప్‌లైన్‌ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తామన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

పాములపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జూటూరు సచివాలయాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జీఎస్‌డబ్ల్యుఎస్ సర్వేలను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

గో సంరక్షణ పథకానికి రూ. లక్ష విరాళం

శ్రీశైలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి హైదరాబాద్ వాసు లు చెన్ను దుర్గసత్యనారాయణ కుటుంబ సభ్యులు బుధవారం రూ. 1,00,116 ఆలయ పర్యవేక్షకుడు శివప్రసాద్‌కు అంద జేశారు. దాతలకు రసీదు, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

మహానంది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అధికారులు దసరా కానుకగా వస్త్రాలు అందజేశారు. బుధవారం మహానంది సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ తన సొంత నిధులతో వస్త్రాలను ఎంపీడీవో మహమ్మద్‌దౌలా చేతుల మీదుగా అందజేశారు. డీఎల్‌డీవో శివారెడ్డి, ఈవోఆర్డీ నాగేంద్రుడు, వెల్ఫేర్ అధికారి లోకేశ్ గౌడ్, డిజిటల్ అసిస్టెంట్ మారుతీ పాల్గొన్నారు.

పీ4 సర్వేను పకడ్బందీగా అమలు చేయాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేను పకడ్బందీగా నమోదు చేయాలని ఆత్మకూరు డివిజనల్ ప్రణాళిక విభాగం డిప్యూటీ గణాంకాధికారి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలో సచివాలయ సిబ్బందికి జరుగుతున్న పీ-4 శిక్షణా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రవికుమార్ ఉన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్కస్వాములు, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శి రాజారావు, హనుమంతులు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేసి ఎంపీడీవో మేరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలనెలా వేతనం రాకుంటే కుటుంబ పోషణ ఎలా అన్నారు. రవి, శ్రీరాములు, శిఖామణి, చెన్నయ్య, సుబ్బన్న, వెంకటేశ్వర్లు, రాజేష్, తదితరులు ఉన్నారు.

గిరిజనుల భూములపై అధికారుల విచారణ

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ముసలిమడుగు చెంచుగూడెంలోని గిరిజనుల భూములపై ఐటీడీఏ ఏపీవో సురేష్ కుమార్, తహసీల్దార్ ఉమారాణిలు బుధవారం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీవో సురేష్‌కుమార్ మాట్లాడుతూ ముసలి మడుగు గూడెంలోని 9 చెంచు కుటుంబాల జీవనభృతి కోసం 38.37 ఎకరాల భూమిని గత 20 ఏళ్ల క్రితం ఐటీడీఏ అధికారులు కేటాయించారన్నారు. అయితే 2006లో అటవీ హక్కుల చట్టం కింద అటవీ శాఖ అధికారులు ఈ భూములు తమ శాఖకు చెందినవే అంటూ వివిధ రకాల మొక్కలు నాటారని చెప్పారు. గత ఐదు సంవత్సరాల నుంచి ఈ గూడెం ప్రజలు తమ భూముల్లో అటవీ అధికారులు మొక్కలు నాటారని, వాటిని తొలగించి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని ఇటీవల కలెక్టర్‌కు చెంచులు స్పందనలో మొర పెట్టుకున్నారని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ముసలి మడుగు చెంచుల గూడెంను సర్వే చేశారన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని సురేష్ కుమార్ తెలిపారు. ఐటీడీఏ అధికారి శేఖర్ రెడ్డి, వీఆర్వో రామసుబ్బయ్య, సర్వేయర్ రాజు, పెద్ద భీమన్న, పుల్లన్న పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లి

అడవి సంరక్షణ అందరి బాధ్యత: రేంజర్



మాట్లాడుతున్న రేంజర్ ముర్తుజావలి

రుద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అడవి సంరక్షణ అందరి బాధ్యత అని రేంజర్ ముర్తుజావలి అన్నారు. బుధవారం రేంజ్ కార్యాలయంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడుదాం.. వాటిని వేటాడితే 1972 వన్యప్రాణి చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రుద్రవరం రేంజ్‌లో ఐదు సెక్షన్‌లు, 14 బీట్‌లు ఉన్నాయన్నారు. 42113.98 హెక్టార్లలో రేంజ్ విస్తరించి ఉందన్నారు. అడవి నుంచి వెదురు, కలప అక్రమ రవాణాకు పాల్పడకుండా నివారిద్దామన్నారు. వేటగాళ్లపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. అటవీ ప్రాముఖ్యతను కళాశాలలు, పాఠశాలల్లో వివరించాలన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు మక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌ఖాన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీ లేని సమాజానికి పాటుపడుదాం

డోన్ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని హ్యాండ్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్ అన్నారు. పట్టణంలోని గుత్తిరోడ్డు, పాతబస్టాండు, ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్ ద్వారా వీడియో స్కీన్ వేసి హెచ్‌ఐవీ లక్షణాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.

వరదల ధాటికి

దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు



రూపనగుడి చెరువు వద్ద దెబ్బతిన్న రోడ్డు

నాలుగు రోజుల క్రితం వచ్చిన వరదల కారణంగా మండలంలోని పలు రోడ్లు, కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మండలంలోని రూపనగుడి గ్రామంలో బోడెమ్మనూరు గ్రామానికి వెళ్లే రస్తాలో ఎర్రవాగుపై ఏర్పాటు చేసిన కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కోవెలకుంట్ల - జమ్మలమడుగు జాతీయ రహదారిలో రూపనగుడి గ్రామ చెరువు అలుగు వద్ద రోడ్డుపై తారు, కంకర లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

●ఉయ్యాలవాడ, ఆంధ్రజ్యోతి



రూపనగుడి గ్రామం వద్ద బోడెమ్మనూరు రస్తాలో దెబ్బతిన్న కల్వర్టు

వీడని వర్షం..

- తగ్గని వరద నీరు
- వెయ్యి ఎకరాల్లో దెబ్బతిన్న పొలాలు
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన



గొట్లూరులో పొలాల్లో నిలిచిన వరద నీరు

చాగలమర్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా బుధవారం మళ్లీ ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షంతో పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. మండలంలోని గొట్లూరు, నేలంపాడు గ్రామాల సమీపంలో పంట పొలాల్లో వరద నీరు ప్రవహించడంతో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, మినుము, జూట్, బెండ పంటలు దెబ్బతిని లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. వెయ్యి ఎకరాల్లో పంటలు దెబ్బతిని నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వారం రోజుల నుంచి పంట పొలాల్లో వరద నీరు తగ్గకపోవడంతో నీట మునిగిన పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు విలపిస్తున్నారు. పంట పొలాల్లో వరద నీరు ప్రవహిస్తే పంటలను బీళ్లు పెట్టుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పంట పొలాల్లో వరద నీరు ప్రవహించకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పాలకులు, అధికారులను పలుమార్లు కోరిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంటలను పరిశీలించి పరిహారం అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఆశా వర్కర్లపై చిన్నచూపు తగదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లు చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నారని, వారిపై ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం తగదని ఆశా వర్కర్ల యూనియన్ నేతలు, ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యం లో ఆశావ ర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కొలిమిగుండ్ల తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం నాయకులు లక్ష్మీదేవి, ప్రమీల, శోభ, రంగమ్మ, బయమ్మ, ఏఐటీయూసీ నాయకులు కుళ్లాయిస్వామి, మహేష్, చంటి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు, ఏఐటీయూసీ నాయకులు



చాగలమర్రిలో వాసవీమాతకు పూజలు చేస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి



శిరివెళ్లలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు



దొర్నిపాడులో గాయత్రీదేవిగా..



బెలుం, కోవెలకుంట్లలో అన్నపూర్ణదేవిగా..



రుద్రవరంలో సంతాన లక్ష్మీదేవిగా..

వివిధ రూపాల్లో అమ్మవారు

బనగానపల్లె, డోన్, ఆళగడ్డ నియోజకవర్గాల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడో రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బేతంచెర్లలో..



తిమ్మనాయుని పేట, డోన్‌రూరల్‌లో భ్రమరాంబదేవిగా..




సంజామలలో అన్నపూర్ణదేవిగా..



ఆళ్లగడ్డలో అమ్మవారికి ముక్కుపుడక వితరణ చేస్తున్న భక్తులు



రుద్రవరంలో కన్యకాపరమేశ్వరి దేవిగా..



బేతంచెర్లలో విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారిశాల



డోన్‌లో తాళిబొట్టును బహూకరిస్తున్న భక్తులు



డోన్‌లో..



ఉయ్యాలవాడ, ప్యాపిలిలో అన్నపూర్ణదేవిగా..

ఊళ్లకెళ్లేవారు.. జరభద్రం: సీఐ

డోన్‌టౌన్/ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు బంధువుల ఇళ్లకు, పల్లెలకు వెళ్లే వారు జరభద్రంగా ఉండాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా సూచించారు. బుధవారం ఆయన కార్యాల యంలో మాట్లాడుతూ ఊళ్లకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లో ఏమైనా బంగారు ఆభరణాలు ఉంటే బ్యాంక్ లాకర్లలో భద్రంగా దాచుకోవాలన్నారు. ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సంఘాలను బలోపేతం చేయండి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత మహిళలదేనని వెలుగు ఏపీఎం దాసన్న అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. సీఆర్పీ అనూరాధ మాట్లాడుతూ మన డబ్బు - మన లెక్కలు అనే అంశంపై వారికి వివరించారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వరూప నగర్ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు సోముల రామక్రిష్ణారెడ్డి బుధవారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ యువ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి ఇంటికి చేరుకొని మృతదేహంపై పూల మాలలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

1,200 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

చాగలమర్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ, కోవెలకుట్ల క్లస్టర్ పరిధిలో 1,200 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని కోవెలకుంట్ల క్లస్టర్ పరిధి ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగు లాభదాయ కమని, వంద శాతం సబ్సిడీతో రైతులకు 16 రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. చాగలమర్రి మండలంలో 110 ఎకరాలకు 70 ఎకరాల దాక గుర్తించామన్నారు..

ఇన్‌చార్జి ఎంపీడీవోగా తాహిర్‌హుసేన్



ఇన్‌చార్జి ఎంపీడీవోను సన్మానిస్తున్న ఏవో, కార్యదర్శులు

చాగలమర్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న తాహిర్‌హుసేన్ బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఏవో రాజేంద్రప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులు, ఈవో, పంచాయతీ సిబ్బంది ఆయనను స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఈవో తారకేశ్వరి, ఎంసీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్యాపిలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

చాగలమర్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చక్రవర్తుల పల్లె గ్రామంలో 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఆయన స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్దులాపురం, కోరుమానుపల్లె గ్రామాల్లో విద్యుత్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడీ సతీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది తనిఖీలు చేశారు. ఈసందర్భంగా పలు ఇళ్లు, వ్యాపార సముదాయాలకు సంబంధించిన కనెక్షన్లను పరిశీలించారు. అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. సబ్ ఇంజనీరు లక్ష్మణస్వామి, లైన్‌మెన్లు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి బాధాకరం

చాగలమర్రి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు దేశంరెడ్డి మృతి బాధాకరమని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. ఆయన మృతి విషయం తెలు సుకొని బుధవారం గొడిగనూరులో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ: చాగలమర్రి గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం ఏవో రంగనేతాజీ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశలించారు.

పశువులకు టీకాలు వేయించండి

సంజామల,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాడిపశువులు ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు కొండారెడ్డి రైతులను కోరారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆకుమళ్ల గ్రామంలో పాడిపశువుల, ఆవులు, ఎద్దులకు వ్యాధి నివారణ టీకాలు వేయించారు.

నిత్యావసరాలను సకాలంలో పంపిణీ చేయండి




కోవెలకుంట్లలో మాట్లాడుతున్న తహసీల్దారు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులను రేషన్ డీలర్లు సకాలంలో ప్రజలకు పంపిణీ చేయాలని కోవెలకుంట్ల తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమీక్ష సమా వేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వతేదీ లోపు రేషను షాపుల వద్ద ఉదయం, సాయంత్రం నిత్యావసర వస్తువులు ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. 20వ తేదీ నుంచి నెలాఖరు వరకు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీటీ నరసింహారెడ్డి, ఆర్ఐ లక్ష్మి, సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, డీలర్లు పాల్గొన్నారు.

సంజామల: నిత్యావసర సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్ డీలర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి డీలరు రేషన్ దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయిం చిన ధరకే సరుకులు విక్రయించాల, నిల్వలు పంపిణీ పూర్తి అయిన తరువాత ఈపాస్ మిషన్లు ఉన్న నిల్వలకు స్టాక్ నిల్వలు సమానంగా ఉండాలని తేడాలు రాకుండా చూసుకోవాలని అన్నారు.

బంగారు కుటుంబాలను అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్

సంజామల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీ 4 సర్వే ద్వారా ఎంపికైన బంగారు కుటుంబాలను అభివృద్ధికి కృషి చేయాలని సచివాలయ ఉద్యోగులను ఎంపీడీవో సాల్మన్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బంగారు కుటుంబాల అభివృద్ధికి సంబంధించి తీసుకోవాల్సిన మార్గదర్శకాలను శిక్షకులు ఇమామ్ హుసేన్, నరసింహా రెడ్డి, సచివాలయ ఉద్యోగులకు తెలియజేశారు.

రుద్రవరం: బంగారు కుటుంబాలు మార్గదర్శకాలపై సచివాలయ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. శిక్షకులు శివక్రిష్ణ, రవీంద్రనాయక్‌లు, సుజాత, సచివాలయ ఉద్యోగులకు బంగారు కుటుంబాల సర్వేపై అవగాహన కల్పించారు.

దొర్నిపాడు: పేదల సాధికారత కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని ఈవోపీ ఆర్డీ శివప్రసాద్ అన్నారు. బుధవారం దొర్నిపాడు మండల ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలకు పీ-4పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండలంలో పీ-4 కార్యక్రమం కింద 738 కుటుంబాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రామిరెడ్డి, సచివాలయ కో-ఆర్డినేటర్ శేఖర్ పాల్గొన్నారు.